# మీరు దేశ పౌరులు కాదా?

- ప్రజల ఆరోగ్యం మీకు పట్టదా?
- శిక్షణ ఇచ్చి ఐఏఎస్‌లను చేస్తే.. సామాన్య ప్రజలకు ఏం సేవ చేస్తున్నారు
- డెంగీ నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి
- కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి
- ఎవరైనా డెంగీతో మరణిస్తే అందుకు మీదే బాధ్యత
- సొంత అకౌంట్ నుంచి రూ. 5లక్షలు చెల్లించాల్సి ఉంటుంది
- తెలంగాణ ఐఏఎస్‌లపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్24(ఆర్ఎన్ఎ) : మీరు దేశ పౌరులు కాదా.. కోట్లు ఖర్చుచేసి శిక్షణ ఇచ్చి ఐఏఎస్‌లను చేస్తే.. మీరు సామాన్య ప్రజలకు ఏం సేవ చేస్తున్నారు.. డెంగీ నివారణపై అసలేం చర్యలు తీసుకున్నారు.. కేవలం అవి కాగితాల్లోనే కనిపిస్తున్నాయంటూ తెలంగాణ ఐఏఎస్‌లపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డెంగీ నివారణకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని బుధవారం హైకోర్టు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

అయితే గురువారం విచారణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, వైద్య సంచాలకులు రమేశ్ రెడ్డి, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డెంగీ నివారణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను హైకోర్టుకు నివేదించారు. నగరంలో 427 చోట్ల దోమల బెడద అధికంగా ఉందని అధికారులు తెలిపారు. 30 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామని, డెంగీ వ్యాధి రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కోర్టుకు వివరించారు. దీనిపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. డెంగీ నివారణకు తీసుకున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు తీసుకున్న చర్యలు కేవలం కాగితాలపై మాత్రమే కనబడుతున్నాయని అసహనం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి బాగోలేదనీ, డెంగీని నివారించలేకపోతే మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు పరిహారంగా చెల్లించాలని వ్యాఖ్యానించింది. ప్రజల సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులదేనని స్పష్టంచేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి బాగుంటే ప్రజలు కోర్టులకు ఎందుకు వస్తారని హైకోర్టు ప్రశ్నించింది. మూసీ నదిని ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుందని వ్యాఖ్యానించింది. మూసీ నదిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సీఎస్, అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. డెంగీ నివారణ చర్యలు తీసుకుంటున్నట్లయితే జనవరిలో 85గా ఉన్న డెంగీ కేసులు.. అక్టోబర్ నాటికి 3,800కి ఎలా పెరిగాయని ప్రశ్నించింది ఇదే సమయంలో మరోసారి అధికారులు కోర్టుకు వివరణ ఇస్తున్న క్రమంలో తెలంగాణ ఐఏఎస్‌లపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి శిక్షణ ఇచ్చి ఐఏఎస్‌లను చేస్తే.. మీరు సామాన్య ప్రజలకు ఏం సేవ చేస్తున్నారని మండిపడింది. ఈ సందర్భంగా తెలంగాణ ఐఏఎస్‌లు ఈ దేశ పౌరులు కాదా అని న్యాయస్థానం తీవ్రస్థాయిలో ప్రశ్నించింది. కోర్టు ఆదేశాలను పాటించకుంటే ఐఏఎస్‌లపై సుమోటో కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పౌరులు ఎవరైనా మరణిస్తే అందుకు వారే బాధ్యత వహించాలని పేర్కొంది. అలా మరణించిన కుటుంబానికి ఐఏఎస్‌లు తమ సొంత అకౌంట్ నుంచి రూ. 5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ క్రమంలో హైకోర్టు సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సీఎస్ జోషి , ఐఏఎస్‌లు అరవింద్ కుమార్, లోకేష్ కుమార్ , శాంత కుమారి, యోగితా రాణా సైలెంట్‌గా ఉండిపోయినట్లు తెలుస్తుంది.

# సౌదీ అరేబియాకు మోదీ

- ఈనెలాఖరులో పర్యటన

న్యూఢిల్లీ, అక్టోబర్24(ఆర్ఎన్ఎ) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ త్వరలో సౌదీఅరేబియాలో పర్యటించనున్నారు. వార్షిక పెట్టుబడుల సదస్సు నిమిత్తం అక్టోబరు 29న మోదీ సౌదీ వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు తాజాగా వెల్లడించాయి. సౌదీ అరేబియాలో అక్టోబరు 29 నుంచి 31 వరకు ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనీషియేటివ్(ఎఫ్ఐఐ) వార్షిక సదస్సు జరగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు మోదీ వెళ్లనున్నారు. ఒక రోజు పాటు ఈ పర్యటన సాగనుంది. పర్యటనలో భాగంగా పలు ద్వైపాక్షిక అంశాలపై ఇరు దేశాధినేతల మధ్యచర్చలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పెట్రో కెమికల్స్, మౌలిక సదుపాయాలు, మైనింగ్ తదితర రంగాల్లో భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు సౌదీ యువరాజు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత

- పోషక విలువలు పెంచడంపై దృష్టి
- పోషకాహారంలో నిపుణుల సలహాలు తీసుకోవాలి
- సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం

అమరావతి,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పోషక విలువలు పెంచడంపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పిల్లలు ఏం తింటున్నారో గమనించాలన్నారు. ఆ తర్వాత వారికి అందించే ఆహారంలో ఎలాంటి మార్పులు చేయాలనే దానిపై సూచనలు చేయాలని కోరారు. ఇందుకోసం పోషకాహారంలో నిపుణులైన వారి సలహాలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను సూచించారు. రాష్ట్రాన్ని పోషకాహార లోప ఆంధ్రప్రదేశ్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలోని మహిళలు, పిల్లల్లో పోషకాహార లోపం నివారణకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం పైన బుధవారం సీఎం వైఎస్ జగన్ సమీక్ష చేపట్టారు. మహిళలు, పిల్లల్లో పౌష్టికాహార లోపం నివారణలో భాగంగా.. మొదటి దశలో రక్తహీనత, పౌష్టికాహార లోపం అధికంగా ఉన్న గిరిజన, సబ్‌ప్లాన్ ప్రాంతాల్లోని గర్భవతులు, 6 ఏళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని పెంచాలని.. దీనిని పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు. 77 గిరిజన, సబ్‌ప్లాన్ మండలాల్లో డిసెంబర్ నుంచి ఈ పైలట్ ప్రాజెక్టు అమలు కానుంది.

వైఎస్సార్ బాల సంజీవని, వైఎస్సార్ బాలామృతం.. పైలట్ ప్రాజెక్టు అనుసరించి గర్భవతులకు, బాలింతలకు నెలకు రూ. 1062 విలువైన ఆహారం అందించనున్నారు. 25 రోజులపాటు రోజూ భోజనం, గుడ్డు, 200 మి.లీ. పాలతో పాటు రూ. 500 విలువ చేసే వైఎస్సార్ బాల సంజీవని కిట్ ఇస్తారు. వైఎస్సార్ బాల సంజీవని కిట్‌లో మొదటి వారం రెండు కేజీలు మల్టీ గ్రెయిన్ ఆటా, రెండో వారం అర కేజీ వేరుశనగలతో చేసిన చిక్కీ, మూడో వారం అర కేజీ రాగి ఫ్లేవర్, అర కేజీ బెల్లం, నాలుగో వారం అర కేజీ నువ్వులుండలు అందజేస్తారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులకు నెలలో ప్రతి రోజూ గుడ్డు, 200 మి.లీ. పాలు, వైఎస్సార్ బాలామృతం కిట్టు కింద రోజుకు 100 గ్రాముల చొప్పున 2.5 కేజీలు మొత్తంగా రూ. 600 విలువ చేసే పౌష్టికాహారం ఇవ్వనున్నారు. అలాగే 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నెలకు 25 రోజులు పౌష్టికాహారం అందజేయాలని నిర్ణయించారు. మొత్తంగా నెలకు రూ. 560లతో పౌష్టికాహారం అందించనున్నారు. ఈ మేరకు నెలలో 25 రోజులపాటు భోజనం, గుడ్డు, 200 మి.లీ. పాలు, పోషకాల ఇచ్చే మరో అల్పాహారం అందజేస్తారు.

పైలట్ ప్రాజెక్టు అమలయ్యే ప్రాంతాలు.. పైలట్ ప్రాజెక్టు అమలు కోసం మొత్తం 36 గిరిజన మండలాలు ఎంపిక చేయగా.. శ్రీకాకుళం జిల్లాలో 1, విజయనగరం జిల్లాలో 7, విశాఖపట్నం జిల్లాలో 11, తూర్పు గోదావరి జిల్లాలో 11, పశ్చిమ గోదావరి జిల్లాలో 6 ఉన్నాయి. సబ్‌ప్లాన్ ప్రాంతానికి సంబంధించి శ్రీకాకుళం జిల్లాలో 19, తూర్పు గోదావరి జిల్లాలో 4, విశాఖపట్నం జిల్లాలో 6, పశ్చిమ గోదావరి జిల్లాలో 3, ప్రకాశం జిల్లాలో 3, కర్నూలు జిల్లాలో 3, గుంటూరు జిల్లాలో 3 కలిపి మొత్తం 41 మండలాలను ఎంపిక చేశారు.

# కేసీఆర్, కేటీఆర్‌పై ఈగవాలినా ప్రజలు ఊరుకోరు

- హుజూర్‌నగర్ తీర్పు ప్రతిపక్షాలకు చెంపపెట్టు
- మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలొస్తాయి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, అక్టోబర్ 24(ఆర్ఎన్ఎ) : తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై చిన్న ఈగ వాలినా రాష్ట్ర ప్రజలు ఊరుకోరని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో 'కారు' ఊహించని రీతిలో దూసుకెళ్తున్న నేపథ్యంలో హన్మకొండలో టీఆర్ఎస్ కార్యకర్తలు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు ప్రజలు ఎన్నికల ద్వారా సమాధానం చెప్పారని, ప్రజల తీర్పును గౌరవించాలన్నారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలు మానాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. అంతటితో ఆగని ఆయన.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు వస్తాయని జోస్యం చెప్పారు. కోర్టు సూచన ప్రకారమే ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీ అనవసర విమర్శలు మాని.. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు తెచ్చి ప్రజలను ఓట్లు అడగాలని లేకపోతే ఎవ్వరు పట్టించుకోరని మంత్రి ఎర్రబెల్లి చెప్పుకొచ్చారు. ఆర్టీసీ కార్మికులను, సర్పంచులను రెచ్చగొట్టారు.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ , బీజేపీ ప్రయత్నించాయని, ప్రజలు ప్రతిపక్షాలను నమ్మలేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్నికి పట్టం కట్టారుని, సీఎం కేసీఆర్ హుజూర్ నగర్ లో సభకు హాజరు కాకపోయినా ప్రజలు టీఆరెస్ పార్టీనే గెలిపించారని మంత్రి అన్నారు. హుజూర్ నగర్ లో 15 ఏండ్లుగా ఉత్తమ్ గెలిచిన ఆ నియోజకవర్గ నికి చేసింది ఏమి లేదుని, ఇక నైనా ప్రతిపక్షాలు అనవసర విమర్శలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

# ఎన్నికల్లో ఓడిపోగానే బెంబేలు పడే వ్యక్తిని కాదు - పవన్ కల్యాణ్

గుంటూరు,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఎన్నికల్లో ఓడిపోగానే బెంబేలు పడే వ్యక్తిని కాదని.. గెలిచినా, ఓడినా చివరి వరకు పార్టీని నడుపుతానని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో ప్రకాశం జిల్లా నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపే ముఖ్యం అనుకుంటే వంద వ్యూహాలు పన్నేవాడినని అన్నారు. కేసులు ఉన్నవారు పైవారి దగ్గర బలంగా మాట్లాడలేరని, కేసులు ఉన్నవారు సీఎం అయితే..ఎంత వరకు న్యాయం జరుగుతుందని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. జాతీయ స్ఫూర్తి కలిగిన నాయకులు కావాలన్నారు. తనకు జగన్, చంద్రబాబుతో వ్యక్తిగత విభేదాలు లేవని.. వారు తనకు నష్టం చేసినా పట్టించుకోనని పవన్ అన్నారు. డబ్బు, మద్యం పంచని ఎన్నికలు రావాలని పవన్ కల్యాణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇసుక కొరత వల్ల నిర్మాణ రంగం కుదేలైందని, వైసీపీ ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. నవంబర్ 3వ తేదీన విశాఖలో భవన నిర్మాణ కార్మికుల కోసం భారీ ర్యాలీ నిర్వహిస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# విజయనగరంలో ఎడతెరిపిలేని వర్షం

- జోరు వర్షాలతో నీట మునిగిన గ్రామాలు
- సాయం కోసం ప్రజల ఎదురుచూపు
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

విజయనగరం,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): విజయనగరంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. గురువారం ఉదయం ప్రధాన రహదారి ఎల్ఐసి బిల్డింగ్ రోడ్డు, చిన్న మార్కెట్, పెద్ద మార్కెట్ లలో పూర్తిగా వరద నీరు నిలిచిపోగా, అయ్యన్నపేట, కామాక్షి నగర్ ప్రాంతాల్లోని చెరువులు గండికొట్టడంతో జలదిగ్బంధలోకి వెళ్లిపోయాయి. విజయనగరం పట్టణంలో పలు ప్రాంతాలైన పద్మావతి నగర్ ఏడవ లైన్‌లోకి నీరు భారీగా చేరుకుంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల గోడలు కూలిపోయాయి. ముఖ్యంగా రింగ్ రోడ్డు, రామకఅష్ణ నగర్, తదితర ప్రాంతాల్లోకి వరద నీరు భారీగా చేరి ఇంటి గోడలు కూలిపోయాయి.

బయటకి వెళ్లే మార్గం లేక చాలామంది ఇంటికే పరిమితమవుతున్నారు. మరోవైపు భారీ వర్షాల దఅష్ట్యా విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ హరి జవహర్ లాల్ గురువారం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, పాఠశాలలకి, అంగన్‌వాడి కేంద్రాలకు సెలవు ప్రకటించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. చాలా చోట్ల ఓ మోస్తరు నుంచి భారీగా వాన పడుతోంది. ఇప్పటికే రెండు రోజులుగా ముసురేసింది. దాదాపు అన్ని మండలాల్లోనూ బుధవారం ఉదయం నుంచి వాన పడుతూనే ఉంది. భారీ వర్షాల సమాచారంతో కలెక్టర్ హరిజవహర్‌లాల్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అప్పటికే కొందరు స్కూళ్లకు వెళ్లిపోయారు. వారంతా ఇంటికి చేరుకునే క్రమంలో అవస్థలు పడ్డారు. వర్షాలకు చాలా ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయాయి. అటు అధికారులు.. ఇటు ప్రజలు కూడా అంతంతమాత్రంగానే కనిపించారు. వాగులు పొంగాయి. రోడ్లపైకి నీరు చేరుకోవటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లా కేంద్రంతో పాటు, గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, సాలూరు, మక్కువ మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పొలాల్లో భారీగా వర్షపునీరు చేరింది. వర్షాలకు కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాను నిలిపేశారు. జిల్లా కేంద్రం చిన, పెద మార్కెట్లలోకి మోకాళ్లలోతు నీరు చేరింది. రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో కలెక్టర్ హరిజవహర్‌లాల్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అధికారులంతా అందబాటులో ఉండాలని ఆదేశించారు. కంట్రోల్ రూంలోని అధికారులు రౌండ్‌ద క్లాక్ పనిచేయాలని సూచించారు. జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా నంబరు 08922 236947కు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చుని ప్రకటించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టంచేశారు.

# 26డిమాండ్లు పరిష్కరించాల్సిందే..

- ఏ ఒక్క డిమాండ్‌లోనూ వెనక్కి తగ్గం
- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్24(ఆర్ఎన్ఎ) : తాము లేవనెత్తిన 26డిమాండ్లపై చర్చించాల్సిందేనని, ఏఒక్క హామీలోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీ సమ్మెలో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో ఆందోళనలో అశ్వత్థామరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26 డిమాండ్లలో ఏ ఒక్కదాని నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తేలేదన్నారు.

అనివార్య కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం రాస్తారోకో కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ ఆర్టీసీ కార్మికులను తెలంగాణ ఉద్యమంలో వాడుకుని ఇప్పుడు వదిలేశారని ఆరోపించారు. సిగ్గు, శరం లేకుండా కేసీఆర్ పూటకో మాట మారుస్తున్నారని ధ్వజమెత్తారు. సెల్ఫ్ డిస్మిస్ అనే కొత్త పదాన్ని కనిపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈడీలు, బేడీల కమిటీపై తమకు నమ్మకం లేదని తేల్చిచెప్పారు. ఇన్నిరోజులు ఈ ఆరుగురు ఈడీలు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను మాఫియాగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు. ఈనెల 30న సరూర్‌నగర్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం అన్ని స్కూళ్లు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు తమ సమస్యలను తెలియజేస్తామని అశ్వత్థామరెడ్డి వెల్లడించారు.

# సీఎం పదవి మాకే : శివసేన ఎంపీ

ముంబై, అక్టోబర్ 24: మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ, శివసేన కూటమి స్పష్టమైన మెజార్టీ దిశగా దూసుకుపోతున్నాయి. 103 స్థానాల్లో బీజేపీ, 68 స్థానాల్లో శివసేన, కాంగ్రెస్ 41 స్థానాల్లో, 49 స్థానాల్లో ఎన్సీపీ, ఇతరులు 27 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. శివసేన అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆ పార్టీ ఎంపీ సంజయ్‌రావత సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవి శివసేనకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగిలిన మంత్రి పదవులు సగం, సగం పంచుకోవాలని తెలిపారు. ఈ విషయం తాను పార్టీ అధినేత ఉద్ధవ్ థాకరేతో సమావేశమై చర్చించనున్నట్లు వెల్లడించారు.

# చంద్రబాబు హుందాతనం కోల్పోతున్నారు - బొత్స

అమరావతి,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ప్రజలు చిత్తుగా ఓడించిన తర్వాత కూడా టీడీపీ అధినేత చంద్రబాబులో మార్పు రాలేదని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. తనకు పేరొస్తుందని అమరావతిని సీఎం జగన్ ఆపేశాడని చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బొత్స అన్నారు. ఏం చేశారని మీకు పేరొస్తుందని చంద్రబాబును మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఏం ఉద్ధరించారని నిలదీశారు. ఐదేళ్లలో కనీసం ఒక్క కట్టడమైనా కట్టారా? మహా అయితే చదరపు అడుగుకు రూ.3 వేలు ఖర్చయ్యే చోట రూ.10 వేలు చూపి అమరావతిలో తాత్కాలిక కట్టడాలు నిర్మించారని ఆయన మండిపడ్డారు. రూ.1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని, మీరు చేసిన అభివృద్ధి ఏంటో చూపాలన్నారు. పైగా అధికారం పోగొట్టుకునే నాటికి రూ.50 వేల కోట్ల బిల్లు చెల్లింపులు బకాయి పెట్టారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వాన్ని అడిగే హక్కు చంద్రబాబుకు ఎక్కడిదని మరోసారి ప్రశ్నించారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో ఏపీకి పూడ్చలేనంత నష్టం వచ్చిందని బొత్స తెలిపారు.

# శానంపూడి సైదిరెడ్డి జీవిత నేపథ్యం..

హైదరాబాద్, అక్టోబర్24:హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితంలో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 43,624 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. సైదిరెడ్డి 1974, ఏప్రిల్ 18వ తేదీన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుండ్లపల్లిలో అంకిరెడ్డి, సత్యవతి రెడ్డి దంపతులకు జన్మించారు. పదో తరగతి వరకు మఠంపల్లి మండలంలోని వీవీ హైస్కూల్‌లో చదువుకున్నారు. ఇంటర్ హుజుర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో, డిగ్రీ ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో అభ్యసించారు. 2002, అక్టోబర్ 25వ తేదీన రజిత రెడ్డితో సైదిరెడ్డికి వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు అంకిరెడ్డి(16), అనిరుధ్ రెడ్డి(13).కెనడాలో స్థిరపడ్డ సైదిరెడ్డి.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో కేసీఆర్ ఉద్యమానికి ప్రభావితం అయ్యారు. తద్వారా ఎన్నారైలతో కలిసి ఉద్యమం కోసం పని చేశారు. ప్రత్యేక రాష్ట్ర ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడంలో సైదిరెడ్డి తనదైన పాత్ర పోషించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహించి ఉద్యమ స్ఫూర్తిని నెలకొల్పారు సైదిరెడ్డి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తన ప్రాంతానికి సేవ చేసేందుకు నిర్ణయించుకున్న సైదిరెడ్డి.. కెనడా నుంచి సొంతూరుకు వచ్చారు. యువతకు అనేక రకాలుగా తోడ్పాటును అందించారు. అంతేకాకుండా గ్రామీణ నైపుణ్యాభివృద్ధి సంస్థను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కోసం శిక్షణ ఇప్పించారు. ఇప్పటికీ ఇది జరుగుతోంది. తన తండ్రి అంకిరెడ్డి పేరిట ఓ ఫౌండేషన్‌ను నెలకొల్పి ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సీఎం కేసీఆర్ సూచనల మేరకు హుజుర్‌నగర్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే 2018 ఎన్నికల్లో సైదిరెడ్డికి హుజుర్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారు. అప్పుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతిలో సైదిరెడ్డి ఓటమి పాలయ్యారు. ఓటమిని పక్కనపెట్టి ప్రజల కోసం మళ్లీ పని చేయడం మొదలుపెట్టారు. నియోజకవర్గ సమస్యలపై ఎప్పటికప్పుడూ పోరాటం చేస్తూ పరిష్కరించేవారు. కేటీఆర్‌తో సన్నిహితంగా ఉంటూ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 80 కోట్ల నిధులను సమకూర్చగలిగారు. దీంతో సైదిరెడ్డిపై ప్రజలు విశ్వాసం చూపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని 141 సర్పంచ్‌లకు గానూ 113 సర్పంచ్‌లను గెలిపించారు. ఏడు జడ్పీటీసీలలో ఐదు జడ్పీటీసీలను, 71 ఎంపీటీసీలలో 44 ఎంపీటీసీలను గెలిపించారు. దీంతో టీఆర్ఎస్‌లో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఇప్పుడు హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో తనకు వచ్చిన అవకాశాన్ని సైదిరెడ్డి సద్వినియోగం చేసుకోని భారీ మెజార్టీతో ఉత్తమ్ పద్మావతిరెడ్డిపై గెలుపొందారు.

# వైసీపీ నేతల ఇసుక దోపిడిని ఖండించాలి

- నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు విజయవంతం చేయండి
- టెలీకాన్ఫరెన్స్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

గుంటూరు, అక్టోబర్24(ఆర్ఎన్ఎ) : వైసీపీ నేతల ఇసుక దోపిడీని ప్రజల్లో ఎండగట్టాలని, ఇసుక కొరతతో కార్మికులు రోడ్డున పడుతున్నారని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం టీడీపీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా శుక్రవారం తలపెట్టిన ఆందోళనా కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇసుక కొరతకు నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని సూచించారు. అన్ని చోట్ల ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. వైసీపీ నేతల ఇసుక దోపిడిని ఖండించాలన్నారు. నిరసన ప్రదర్శనలను విజయవంతం చేయాలని నేతలకు సూచించారు. పనులు కోల్పోయిన లక్షలాది కార్మికులకు అండగా ఉండాలని, వారిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో ఇసుక కొరతతో తాపీవాళ్లు, కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు అనేక వృత్తులవారు ఉపాధి కోల్పోయారని చంద్రబాబు అన్నారు. ఇది వైసీపీ ప్రభుత్వం సృష్టించిన సమస్య అని అన్నారు. లక్షలాది మంది రోజుకూలీలను పస్తుపెట్టారని, వాళ్లందరికీ పరిహారం చెల్లించాల్సింది ప్రభుత్వమేనని చంద్రబాబు అన్నారు. జీవనోపాధి కోల్పోయిన కార్మికులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతన్నారు. ఇళ్ల నిర్మాణాలను వాయిదా వేసుకోమనడం వైసీపీ అసమర్థతని, ఇసుక అందించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, లక్షలాది కార్మికులకు సంఘీభావంగా ఉండాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు సూచించారు.

# తాడేపల్లిలో వరదపై మంగళగిరి ఎమ్మెల్యే సమీక్ష

గుంటూరు,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళఖాతవలో అల్పపీడన ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా వానలు పడుతున్నాయి. దీంతో గుంటూరు జిల్లా తాడేపల్లి సీతానగరంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. ఉదయం అధికారులతో కలసి వరదపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం సుమారు 3.5 లక్షల క్యుసెక్కుల వరద ఎగువ నుండి వస్తోంది. ఈ సాయంత్రానికి 6 లక్షల క్యుసెక్కులు దాటుతుందని అంచనా వేస్తున్నారు. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు అందరూ అందుబాటులో ఉండి... తగిన జాగ్రత్తలు తీసుకోవాలని..ఎమ్మెల్యే ఆర్కే సూచించారు.

# బండ్ల గణేష్‌కు 14రోజుల రిమాండ్

కడప, అక్టోబర్24(ఆర్ఎన్ఎ) : నటుడిగా, నిర్మాతగా తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితుడైన బండ్ల గణెశిష్‌కు కడప కోర్టు 14 రోజుల రిమాండ్‌ను విధించింది. నవంబర్ 4 వరకూ ఆయన రిమాండ్ కొనసాగనుంది. గురువారం ఆయన కడప కోర్టుకు హాజరయ్యారు. బండ్ల గణెశిష్ కడప జిల్లా మేజిస్ట్రేట్ అరెస్ట్ వారెంట్‌ను జారీ చేశారు. కానీ గత కొంతకాలంగా ఆయన కోర్టుకు హాజరు కావడం లేదు. 2011లో కడపకు చెందిన మహేష్ అనే వ్యక్తి దగ్గర బండ్ల గణెశిష్ రూ.13కోట్ల అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బండ్ల గణెశిష్‌పై 2013లో మహేష్ చెక్ బౌన్స్ కేసు నమోదు చేశాడు. దీంతో కడప పోలీసులు బండ్ల గణెశిష్‌పై కేసులు నమోదు చేశారు. కోర్టుకు హాజరుకాకపోవడంతో కడప జిల్లా మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. కాగా.. గతంలో కూడా బండ్ల గణెశిష్‌పై తెలుగు రాష్ట్రాల్లో పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. ప్రముఖ నిర్మాత పీవీపీతో పాటు ముంబైకి చెందిన ఫైనాన్సియర్ ఒకరు బండ్ల గణెశిష్‌పై కేసు నమోదు చేశారు.

# మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా దీపావళి ఆఫర్లు




హైదరాబాద్, అక్టోబర్, 24: భారత దేశపు అతి పెద్ద మోడ్రన్ హోల్ సేలర్, ఫుడ్ స్పెషలిస్ట్ మెట్రో క్యాష్ అండ్ క్యారీ తమ విస్తృత శ్రేణి తమ ఉత్పత్తుల్లో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. తమ సొంత బ్రాండ్ల విభాగంపై తమ నవోదిత వ్యాపార వినియోగదారులకు దీపావళి పండుగను పురస్కరించుకొని పలు రాయితీలను అందిస్తుందని మనీష్ సబ్నిస్ డైరెక్టర్ ఆఫర్ మేనేజ్, సప్లయ్ చైన్ అండ్ ఓన్ బ్రాండ్ తెలిపారు. స్వీట్ బాక్స్, స్నాక్స్, సీజనల్ గిఫ్ట్ ఐటెమ్స్ క్లాక్స్, టేబుల్ వేర్ క్రోకరీ ఇతర గృహోపకరణాలపై ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆకర్షణీయమైన పండుగ ఆఫర్లు మెట్రో సభ్యులను ఆకర్షిస్తున్నాయన్నారు. మెట్రో ఇప్పుడు సిల్వర్ కాయిన్ జాక్‌పాట్‌ను పరిచయం చేసింది. ప్రత్యేకమైన ఈ స్కీమ్ ఖచ్చితంగా 3 గ్రాముల వెండి నాణెమును తమ వ్యాపార వినయోగదారులకు 8వేల రూపాయలు లేదా ఆపైన చేసే కొనుగోళ్లపై అందిస్తుంది. మెట్రో సభ్యులెవరైనా 56 నాణెములను ఈ పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 27 మెట్రో క్యాష్ స్టోర్‌లో పొందవచ్చు అనిమనీష్ సబ్నిస్ తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 13 సొంత బ్రాండ్లు, తమ పోర్ట్ పోలియోలో 1000కు పైగా ఉత్పత్తులు ఆహారం, ఆహారేతర విభాగాలలో ఉన్నాయి. ఆహారంలో కీలక బ్రాండ్లలో ఆరో, ఫైన్‌లైఫ్ బయో, మెట్రోచెఫ్ రియోబా మొదలైనవి ఉన్నాయి. నాన్ ఫుడ్ బ్రాండ్లలో ఆరో, సిగ్మా మెట్రో ప్రొఫెషనల్‌లు ఉన్నాయన్నారు.

# నవంబర్‌లో భీమిలి ఉత్సవాలు


విశాఖపట్నం,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): భీమిలి ఉత్సవ్‌ను నవంబర్ 9, 10 తేదీలలో నిర్వహిస్తామని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సినీ, స్థానిక కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిసామన్నారు. హాట్ ఎయిర్ బేలున్ ప్రదర్శన, ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే డిసెంబర్‌లో విశాఖ ఉత్సవం క్రమ తప్పకుండా నిర్వహిస్తామన్నారు. భీమిలీ ఉత్సవ సమయంలో విశాఖ నుంచి భీమిలికి ఉచిత బస్సులు నడుపుతామన్నారు. రూ. 50 లక్షల బడ్జెట్‌తో ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఇసుక కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని, ఉగాదికి అర్హులైన పేదలకు ఇల్లు కట్టి ఇస్తామని మంత్రి అవంతి స్పష్టం చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న విజిల్ బృందం

తిరుమల,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): శ్రీవారిని సినీనటి నయనతార,తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్, డ్రమ్స్ శివమణిలు దర్శించుకున్నారు.ఉదయం వి.ఐ.పి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని వీరు మొక్కులు తీర్చుకున్నారు. టీటీడీ ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పట్లు చేసారు.. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వీరికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా. ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసారు. విజిల్ చిత్రం శుక్రవారం విడుదల కాబోతున్న నేపథ్యంలో వీరు స్వామిని దర్శించుకున్నారు.

# కాలేజీలో అగ్నిప్రమాదం

రాజమండ్రి,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఆర్ట్స్ కాలేజీలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఆర్ట్స్ కాలేజీ జాగ్రఫీ విభాగంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరా మెయిన్ స్విచ్ ఆఫ్ చేశారు. దీంతో అంతా ఊపిరి తీసుకున్నారు. సుమారు 15 నిముషాలపాటు మంటలు వ్యాపించాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. స్విచ్ బోర్డు, మీటరు కాలిపోయాయి.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.